పెరిగిన తాటిపూడి రాజర్వాయర్ నీటిమట్టం

లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు

విశాలాంధ్ర-జామి/గంట్యాడ: తాటిపూడి రిజర్వాయర్‌లో నీటిమట్టం భారీగా పెరగడంతో రిజర్వాయర్ పరిధిలోని మండలాలల ప్రజలను రైతాంగానికి హెచ్చరికలను అధికారులు జారీ చేసారు. రిజర్వాయర్‌లో నీటి సామర్థ్యం 297 అడుగుల కాగా ప్రస్తుతం నీరు 295.40 అడుగులకు చేరుకుంది. దీంతో అధికారులు ముందస్తుగా జాగ్రత్త చర్యలలో భాగంగా బుధవారం ఒక గేటును ఎత్తి 350 క్యూసెక్కుల నీటిని వదిలిపెట్టారు. ప్రస్తుతం ఇన్‌ఫ్లో 450 క్యూసెక్కులుగా ఉంది. నీటిని వదిలి నందున గోస్తనీ నదిలో నీటి ప్రవాహం ఎక్కువగా పెరుగుతున్నందున ప్రాజెక్టు దిగువన ఉన్న గంట్యాడ, జామి, ఎస్‌కోట మండలాలలో నదీ ప్రాంత గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డా. బిఆర్. అంబేద్కర్ హెచ్చరించారు. వర్షాలు కురుస్తుండడంతో నీటి ఉధృతి మరింత పెరగవచ్చని తెలిపారు.

క్షేత్రస్థాయిలో మాదక ద్రవ్యాల నియంత్రణకు 'సంకల్ప రథం'తో ప్రచారం

ఎస్పీ వకుల్ జిందల్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : మాదక ద్రవ్యాల వలన కలిగే అనర్థాలను యువతకు వివరించి, వారిని మాదక ద్రవ్యాల అలవాటుకు దూరం చేసేందుకు క్షేత్ర స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు 'సంకల్ప రథం'తో ప్రచారం చేపడుతున్నట్లుగా జిలా ఎస్పీ వకుల్ జిందల్ డిసెంబరు 25న తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతతోపాటు డ్రగ్స్‌కు అలవాటుపడిన వ్యక్తులు, ప్రజలకు 'సంకల్పం' కార్యక్రమాన్ని మరింత చేరువ చేసి, డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు సంకల్పించి ప్రత్యేకంగా 'సంకల్ప రథం' ను రూపొందించి, రాష్ట్ర హెరీంశాఖామాత్యులు చేతులమీదుగా ఇటీవల ప్రారంభించి నట్లుగా తెలిపారు. ఈ సంకల్ప రథంతో ప్రజల్లో మరింత చైతన్యం తీసుకొని వచ్చేందుకు జిల్లా వ్యాప్తంగా రోజూ ఒక మండలాన్ని సందర్శించి, స్థానిక పోలీసు స్టేషను అధికారి, సిబ్బంది సహకారంతో ఉదయం కళాశాలల్లో వాహనాన్ని నిలిపి, విద్యార్థులకు డ్రగ్స్ వలన కలిగే అనర్థాలను ప్రజలకు వివరించనున్నామన్నారు. అదే విధంగా సాయంత్రం సమయాల్లో అదే మండలంలోని ముఖ్య ప్రాంతంలో వాహనాన్ని నిలిపి, ప్రజలకు, యువతకు మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే అనర్థాలను వివరిస్తూ వారిలో చైతన్యం నింపుతామన్నారు. ఇందుకు సంబంధించి ఒక షెడ్యూలును రూపొందించి, ఏ తేదీన, ఏ మండలానికి సంకల్ప రథం చేరుకుం టుందన్న విషయాన్ని సంబంధిత అధికారులకు ముందుగా సమాచారం అందించడం జరిగిందన్నారు. షెడ్యూలు ప్రకారం స్థానిక పోలీసు అధికారులు, సిబ్బంది ప్రతీ రోజూ ఒక మండలంలోని ఒక కళాశాల, ముఖ్య కూడలిలో వాహనాన్ని నిలిపి, మాదక ద్రవ్యాలవల్ల కలిగే దుష్ప్రభావాలను వీడియోలు ప్రదర్శించి, వివరించనున్నారని తెలిపారు. జనవరి మాసాంతరానికి జిల్లాలోని అన్ని మండలాలను సంకల్ప రథం సందర్శించే విధంగా షెడ్యూలు రూపొందించామని, సంకల్ప రథంతో వీడియోలను ప్రదర్శించి, ప్రజలు, యువతకు రహదారి భద్రత, మహిళల భద్రత, సైబరు మోసాలు పట్ల అవగాహన కల్పించి, వారిని చైతన్యపర్చనున్నట్లుగా జ తెలిపారు.

ప్రశాంతయుతంగా క్రిస్టమస్ వేడుకలు

యేసు క్రీస్తు జననం సందర్భంగా జిల్లాలో నిర్వహించే క్రిస్టమస్ వేడుకల్లో ఎటువంటి అల్లర్లు, మతపరమైన తగాదాలు జరగకుండా ప్రశాంతంగా ముగిసాయని, ముందస్తు భద్రత చర్యల్లో భాగంగా చర్చిల వద్ద పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేపట్టామని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ప్రతీ పోలీసు స్టేషను పరిధిలోని క్రిస్టియన్ సోదరులు ప్రార్థనలు నిర్వహించే చర్చిల వద్ద బందోబస్తు, భద్రత ఏర్పాట్లు చేపట్టడంతోపాటు, సంబంధిత పోలీసు అధికారులు,సిబ్బంది పెట్రోలింగు నిర్వహించారు. క్రిస్టియన్ సోదరులు చర్చిల్లో ప్రార్థనలు నిర్వహిస్తూ, మతసామరస్యాన్ని పాటిస్తూ,మతాలకు అతీతంగా హిందూ - క్రిస్టియన్ సోదరులు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. సంబంధిత డిఎస్పీలు, సిఐలు, ఎస్ఐలు భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించారని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి అండగా ఉంటాం

ఎమ్మెల్యే కోళ్ళ లలిత కుమారి

విశాలాంధ్ర-వేపాడ: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టిసారించి గ్రామాల అభివృద్ధికి అండగా ఉంటామని శృంగవరపు కోట ఎమ్మెల్యే కోళ్ళ లలిత కుమారి పేర్కొన్నారు. కొత్తవలస మండల జనసేన నాయకులు బుధవారం ఆమెను కలిశారు.ఈ సందర్భంగా గ్రామాల్లో సుదీర్ఘ కాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటికే గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఉపాధి హామీ నిధులు కేటాయించినట్టు తెలిపారు. పలుచోట్ల పనులు కూడా పూర్తయినట్టు వివరించారు. మిగిలిన పనులు కూడా సంక్రాంతిలోగా పూర్తిచేసి పల్లె పండగ చేస్తామని తెలిపారు. అలాగే నియోజవర్గానికి జల జీవన్ మిషన్ నిధుల కేటాయింపుపై అమరావతిలో తాజాగా గ్రామీణా భివృద్ధి శాఖ ఉన్నతాధికారులను కలిసినట్టు వెల్లడించారు.గత ప్రభుత్వ హయాంలో ఈ నిధుల వినియోగంలో నిర్లక్ష్యం వహించారన్నారు.నియోజకవర్గ ప్రజల దాహార్తిని తీర్చే అద్భుత కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నట్టు వివరించారు. కార్యక్రమంలో జనసేన కొత్తవలస మండల అధ్యక్షుడు గొరపల్లి రవికుమార్, నాయకులు బూసాల శ్రీను, జనసైనికులు పాల్గొన్నారు.

వేపాడలో మనుస్మృతి పత్రాల దహనం

పాల్గొన్న దళిత నాయకులు యువకులు

విశాలాంధ్ర-వేపాడ: మండల కేంద్రమైన వేపాడలో ఏపీ దళిత కూలి రైతు సంఘం, మండల మాల మహానాడు నాయకులు, యువకులు, బుధవారం మనుస్మృతి పత్రాలను దహనం చేశారు. ఈ సందర్భంగా మండల మాల మహానాడు అధ్యక్షుడు దేబార్కి కిరణ్ మాట్లాడుతూ కులాల పేరుతో ప్రజల్లో పేరుకుపోయిన బానిసత్వాన్ని రూపుమాపడానికి నాడు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ మనుస్మృతిని తగలబెట్టారన్నారు.కులాలను విడగొడుతూ రాసిన అధర్మ శాస్త్రాన్ని అంబేద్కర్ ఇదే రోజున తగలబెట్టారన్నారు.భారతదేశాన్ని ముస్లింలు బ్రిటిష్ వారు పరిపాలించి మనలను బానిసలను చేస్తే నేటి రాజకీయ నేతలు కులాల పేరుతో బానిసలుగా మారుస్తున్నారు. దీనిని ఐక్యమత్యంతో సమైక్యంగా ఎదుర్కొని భార్తావనిని విడగొట్టాలని చూస్తే సహించేది లేదని మండల మాల మహానాడు అధ్యక్షుడు దేబార్కి కిరణ్ హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఏపీ దళితకూలి రైతు సంఘం నాయకులు యువకులు పాల్గొన్నారు.

కబడ్డీ చాంపియన్‌షిప్ లో ప్రతిభ కనబర్చిన విజయనగరం జట్లు

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్: ఈనెల 22 నుండి 24 వరకు తూర్పుగోదావరి జిల్లా రావులపాలెం లో జరిగిన 50వ రాష్ట్రస్థాయి జూనియర్ అంతర్ జిల్లాల బాల, బాలికల కబడ్డీ చాంపియన్‌షిప్ లో విజయనగరం బాలురు జట్టు ద్వితీయ స్థానం బాలికల జట్టు ద్వితీయ స్థానం సాధించారు. వీరి విజయం సాధించడం పట్ల జిల్లా కబడ్డీ సంఘ చైర్మన్ ఐవిపి రాజు,అధ్యక్షులు రంగారావు దొర ,కార్యదర్శి ప్రభావతి, ఆర్గనైజింగ్ కార్యదర్శి లక్ష్మణరావు, ట్రెజరర్ శివకుమార్ సంఘ సభ్యులు అందరూ కూడా హర్షం వ్యక్తం చేశారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ

విశాలాంధ్ర-గజపతినగరం: ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో గజపతి నగరానికి చెందిన రావి స్వరాజ్యం మెమోరియల్ కబడ్డీ క్లబ్ ద్వారా తర్ఫీదు తీసుకున్న ఎస్ కోట మండలానికి చెందిన నీలిమ వినయ్ లు ఈనెల 15వ తేదీన విజయ నగరంలోని రాజీవ్ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ ఎలక్షన్లలో వినయ్ నీలిమ లు ఎంపికై ఈనెల 22 నుంచి 25 వరకు తూర్పుగోదావరి జిల్లా రావులపాలెంలో నిర్వహించిన 50వ రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల జూనియర్ స్థాయి బాల బాలికల కబడ్డీ ఛాంపియన్స్ లో జిల్లా జట్టు తరుపున ప్రాతినిధ్యం వహించి స్త్రీల విభాగంలో నీలిమ పురుషుల విభాగంలో వినయ్ ద్వితీయ స్థానాలు సాధించారని తెలిపారు. జిల్లా జట్టుకు ప్రాతినిధ్య వహించి ద్వితీయ స్థానాన్ని సాధించిన నీలిమ వినయులను జిల్లా క్లబ్ సంఘ చైర్మన్ ఐవిపి రాజు అధ్యక్షులు రంగారావు కార్యదర్శి ప్రభావతి రావి స్వరాజ్యం మెమోరియల్ కబడ్డీ క్లబ్ చైర్మన్ రావి శ్రీధర్ కబడ్డీ కోచ్ తాతబాబు అభినందనలు తెలియజేశారు.

ఎస్పీ చే ఎస్ఐ. సన్యాసినాయుడుకు ప్రశంసా పత్రాలు

విశాలాంధ్ర-డెంకాడ: డెంకాడ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న డెంకాడ ఎస్సై ఆరంగి సన్యాసినాయుడుకు విజయనగరం సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ చేతుల మీదుగా బుధవారం రెండు ప్రశంస పురస్కార అవార్డులు అందుకున్నారు. లోక్ అదాలత్ కేసుల్లో మంచి పురోగతిని సాధించినందుకు గాను, మరొకటి పోలీస్ స్టేషన్కు వచ్చిన ఫిర్యాదుల్లో అంకిత భావంతో పరిశీలించి, విచారణ చేపట్టి త్వరితగతిన పరిష్కరించినందుకుగాను ఈ ప్రశంసాపురస్కారాలు అందుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక సిబ్బంది ఎస్సైను అభినందించారు.

కన్యకా పరమేశ్వరికి వెండి సింహాసనం

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారికి నూతన వెండి సింహాసనం సమకూర్చారు. ప్రముఖ వ్యాపార వేత్త కీ.శే. నారాయణం విశ్వనాధమ్ వారి కుటుంబ సభ్యులు బుధవారం మార్గశిర మాసం దశిమి సందర్భంగా వెండి సింహాసనం సమర్పించగా అమ్మవారు సింహాసనంను అధిరోహించారు. ఈ కార్యక్రమంలో సిఏ నారాయణం వెంకట రమణమూర్తి, వెంకట చలమాజీ, కామేశ్వరరావు, ఈశ్వరకుమార్, శేఖర్, ఏడుకొండలు, రాంజీ, అనంతపల్లి కృష్ణారావు, పెన్న గణపతి రావు పాలక మండల సభ్యులు కుమ్మరి గుంట శ్రీనివాసరావు మరియు నారాయణం వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే అప్పల నరసయ్య

విశాలాంధ్ర-గంట్యాడ: గంట్యాడ మండలం రామవరం గ్రామంలో ఎంపీపీ పీరుబండి హైమావతి జిల్లా ఎస్సి సెల్ చైర్మన్ పీరు బండి జైహింద్ కుమార్ జరుపుతున్న క్రిస్టమస్ వేడుకలలో మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పల నరసయ్య పాల్గొని కేకును కట్ చేసి అందరికి పంచిపెట్టారు క్రిస్టమస్ వేడుకలు ఎంతో అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో జడ్పిటిసి వర్రి నరసింహమూర్తి మండల వైయస్సార్ పార్టీ అధ్యక్షులు జాగరపు అప్పారావు, లచ్చిరెడ్డి కృష్ణ ఎంపీటీసీలు సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

ఫైబర్ నెట్ అక్రమార్కులను కఠినంగా శిక్షించాలి

జనసేన మండల అధ్యక్షుడు సంచాన గంగాధర్

విశాలాంధ్ర-బొబ్బిలి: రాష్ట్రంలో ఇటీవల వెలుగు చూసిన ఏపీ ఫైబర్ నెట్ సంస్థలో అక్రమాలను చూస్తే గత వైయస్సార్సీపి ప్రభుత్వ హయాంలో వ్యవస్థలు ఎంత నిర్వీర్యమయ్యాయో స్పష్టంగా అర్థమవుతుందని తక్షణమే చర్యలు చేపట్టాలని జనసేన మండల అధ్యక్షుడు సంచాన గంగాధర్ డిమాండ్ చేశారు. కూటమి నాయకులను కించపరిచే విధంగా సినిమాలు తీసిన ఒక సినీ దర్శకుడికి అక్రమ చెల్లింపులు జరివిన విషయం ఇంకా మరువకముందే ఫైబర్ నెట్ సంస్థలో అక్రమ ఉద్యోగ నియమకాలు విషయం బయటపడటంతో గత ప్రభుత్వ పెద్దల అక్రమార్జనకు అంతే లేకున్నపోయిందని అనేది సుస్పష్టంగా అర్థమవుతుందని ఆరోపించారు. ఎటువంటి అర్హత లేకపోయినా నియామక పత్రాలు లేకపోయినప్పటికీ గత ప్రభుత్వ మంత్రులు ప్రజాప్రతినిధులు ఇళ్లల్లో పనిచేసిన వ్యక్తులకు అక్రమం గా ఫైబర్ నెట్ సంస్థ తరుపున జీతాలు ఇవ్వడం అత్యంత దుర్మార్గపు చర్య దీనికి బాధ్యులైన అప్పటి సంస్థ ఎండీ మధుసూదన్ రెడ్డిని అరెస్ట్ చేసి విచారణ జరిపితే మరిన్ని విషయాలు బయటపడతాయని,అలాగే సంస్థను 2 వేల కోట్ల రూపాయల నష్టానికి తీసుకొచ్చిన ప్రతి ఒక్క వ్యక్తిని అరెస్టు చేసి తగు చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

జమ్ములో విజృంభిస్తోన్న డయేరియా ...

విశాలాంధ్ర-గుర్ల: మండలంలోని జమ్ములో డయేరియా విజృంభించింది. గ్రామంలో ఒకసారిగా ఆరు డయేరియా కేసులు నమోదు కావడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. జమ్ము సత్యనారాయణమ్మ , కొల్లూరి అనురాధ, నడిపిల్లి సన్యాసఅప్పుడు, వెంపడాపు రామునాయుడు, గొర్లె స్వామినాయుడు, వెంపడాపు శ్రీను బారిన పడ్డారు. గ్రామంలో తాగునీరు కలుషితం కావడం వల్లే డయేరియా కేసులు నమోదు అవుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. అధికారులు తగిన చర్యలు తీసుకొని డయేరియా ప్రబలకుండా చేయాలని స్థానికులు కోరుతున్నారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం : మాజీ ఎంపీ బెల్లాన

విశాలాంధ్ర-చీపురుపల్లి: ఏసుక్రీస్తు బోధనలతోనే ప్రతి ఒక్కరిలో సన్మార్గం సాధ్యపడుతుందని విజయనగరం జిల్లా మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం క్రిస్టమస్ వేడుకలను పుర స్కరించుకొని చీపురుపల్లిలోని చర్చిలలో పాల్గొని క్రిస్మస్ సోదరులకు అందరికీ క్రిస్టమస్ వేడుక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రైస్తవులు అందరికీ కరుణ, ప్రేమ, క్షమాగుణం, దాతృత్వం,త్యాగం, వంటి మంచి గుణాలు బైబిల్ పఠనం ద్వారా అలవడుతుందన్నారు. క్రీస్తు అందించిన మహోన్నత సందేశాలను మానవాళిని సన్మార్గంలో నడిపించడానికి ఎంతగానో ఉపయోగ పడుతున్నాయి అన్నారు. ఈ కార్యక్రమంలో చీపురుపల్లి పట్టణ పరిధిలోగల పలు చర్చిల ఫాదర్లు, ఏసుప్రభు భక్తులు పాల్గొన్నారు.

తుఫానుతో అపరాల పంటలకి తీవ్ర నష్టం

రైతన్నల ఆందోళన

విశాలాంధ్ర-తెర్లాం: మండలంలో రైతన్నల పండించే అపరాల పంటలకు ఇటీవల తుపానుల వల్ల తీవ్రమైన నష్టం వాటిల్లింది. పెసలు, మినుములు లాంటి పంటలు రైతన్నకు కలిసోస్తే కొంతవరకు ఊరట లభిస్తుందని రైతులు ఆశ పడతారు. అలాంటిది ఇటీవల తుఫాను ప్రభావం వలన కురిసే వర్షాలకు పండిన పెసరచేలు, మినప చేలు బురదలో కలిసిపోయి పండిన అపరాల పంటలు భూజెక్కిపోయి కొన్ని మొక్కలు వచ్చి పంట మొత్తం రైతులు కి నష్టం వాటిల్లిందని రైతులు విలేకరులతో వాపోతున్నారు. సంక్రాంతి పండగ కి ఈ పంటల వల్ల వచ్చే డబ్బులతో ఇంటిల్లాపాది బట్టల కొనుక్కొని పండగ ఖర్చులు పెట్టుకొని సంతోషంగా ఉండవలసింది పోయి పంటలు లాస్ అవ్వడంతో రైతులు లో సంతోషం కరువైయింది అని కన్నీళ్లు పెడుతున్న రైతులు. పెసలు కింటా బస్తా రేటు 3000 నుంచి సుమారు 4000 వరకు ఉంటుందని అలాంటిది పంటలపోవడం తో రైతుకు దమ్మిడి వచ్చే అవకాశమే మరి లేదని వరసగా పెట్టిన తుఫానులు వలన రైతు కళ్ళల్లో కన్నీళ్లు మిగిలి గుండె ఆలోచనలో పడి బరువెక్కుతుందని పలు గ్రామాల్లో రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇటువంటి పంట పై ప్రభుత్వం ఆదుకుని, రైతులకు పంట నష్టపరిహారం ఇవ్వాలని కోరుతున్న రైతులు. నెమలాం గ్రామానికి చెందిన ఉత్తరవల్లి.వెంకటరమణ అనే రైతులు ఉద్దవోలు, బూరిపేట, పాములవలస, కాగాం, ఆమిటి, కొరటాం, కొల్లివలస, వెలగవలస, చిన్నపాలవలస, అరసబలగ తదితర గ్రామాలు రైతులు నష్టపోయారాని విలేకర్ల తో తెలిపారు.

తడిచిన మొలకలొచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి : రైతుల విజ్ఞప్తి



విశాలాంధ్ర-భోగాపురం: ఈ ఏడాది ఎటువంటి అంటకాలు లేకుండా బాగా పంట పండిందన్న రైతన్న అసలు అడియాసలయ్యాయి. మండలంలో భూములకు సరైన నీటి వసతి లేక సంవత్సరానికి ఒక పంట పండుతుంది. పండిన ఒక్క పంట కూడా చేతికందని పరిస్థితి ఎదురైంది. చేతికొచ్చిన పంట తడిచిపోయి నీళ్ల పాలయిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. గత కొద్దీ రోజులుగా కురుస్తున్న వర్షాలు కారణంగా కోసి పనల మీద ఉన్న ధ్యానం నుంచి మొలకలు వస్తున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. అలాగే ఎడతెరిపి లేని వర్షాలు కారణంగా పొలాల్లో వరి దిబ్బలు కూడా నీటిలో మునిగి చేను తడిచిపోయిందని రైతులు దిగాలుగా ఉన్నారు. ఈ సంవత్సరం రైతులు నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్న ప్రభుతం 24 గంటలు గడవక ముందే డబ్బులు ఖాతాల్లో జమ చేయడం పట్ల ఆనందించామని, కానీ ఈ అకాల వర్షాలు మాకు నష్టాలు మిగిల్చాయని రైతులు అంటున్నారు. నారుపోసిన దగ్గరనుంచి పంట అమ్ముకునే ప్రతీ దశలోనూ ఇబ్బందిలు పడాల్సి వస్తుందని , ఉపాధి హామీ పనుల వల్ల వ్యవసాయానికి కూలీలు దొరకడం లేదని, కూలి కూడా రేట్లు కూడా బాగా పెరిగిపోయాయని, ఇలాంటి పరిస్థితులలో వ్యవసాయాన్ని వదిలివేయడమే మంచిదని రైతులు అభిప్రాయం పడుతున్నారు. తడిచిన ధాన్యాన్ని, మొలకలు వచ్చిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.ఆరుగాలం శ్రమించి పంటలు పండించిన ప్రతీ సారి రైతుల కంటిలో కనీ కనిపించిన సన్నని కన్నీటి తెరను తుడిచి ఓదార్చే రోజులొస్తాయా... అన్నది ప్రశ్నార్థకం.

మట్టి రోడ్డును తలపిస్తోన్న తారు రోడ్డు....

పట్టించుకోని ఆర్ & బి అధికారులు, పాలకులు

అవస్థలు పడుతున్న 4 గ్రామాల గిరిజనులు

విశాలాంధ్ర-వేపాడ: నిజానికి మట్టి రోడ్డులా గుంతలతో కనిపిస్తున్నా అది మాత్రం తారు రోడ్డే. రోడ్డు వేసిన అనతికాలంలోనే భారీ వాహానాల రాకపోకల వల్ల తారు రోడ్డు కాస్త మట్టి రోడ్డుగా గుంతలుగా మారిపోయింది. ఆ రోడ్డు గిరిజన గ్రామాలకు వేసిన రోడ్డు కాబట్టి గత ఐదేళ్లపాటు అధికారంలో ఉన్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంగాని పాలకులు గాని పట్టించుకున్న దాఖలాలు లేవు. ఈరోడ్డు చూస్తే నాటి పాలకులకు గిరిజనులపై ఎంత చిత్తశుద్ధి ఉందో ఎవరికైనా ఇట్టే అర్థం కాక మానదు.ఆ రోడ్డు ఏ గిరిజన గ్రామాలకు వెళుందంటే మండలంలోని వీలుపర్తి పంచాయతీలోని శివారు గ్రామాలైన కొలుకుపాలెం,పెద దుంగాడ చినదుంగాడతో పాటు వావిలపాడు శివారు కడకొండ గ్రామాలకు ప్రధాన రహదారి ఆ తారు రోడ్డే.మండల కేంద్రం వేపాడకు రావాలంటే ఇదే ప్రధాన రహదారి వీలుపర్తి పంచాయతీలో గల రాతి క్వారీలకు రాతి క్రసర్లకు ఇదే ప్రధాన రహదారి కానీ రోడ్డు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా తక్కువ బరువు గల వాహనాలు మాత్రమే తిరగాలి.పరిమితికి మించి అధిక బరువులతో లారీలు తిరగడంతో ఈ రోడ్డు శిధిలావస్థకు చేరుకోవడంతో పాటు మట్టిరోడ్డులా మారి గుంతల మయంగా తయారైంది. కాగా రాతి క్వారీలకు అనుమతుల నిమిత్తం ప్రజావేదికలు నిర్వహించినప్పుడు మాత్రం ప్రజా వేదికలో అధికారుల ముందు ప్రజల ముందు ఆ రోడ్డు దుస్థితి మార్చి చక్కగా తయారుచేస్తామని హామీలు మాత్రం ఇస్తారు.హామీలు ఇచ్చిన రాతి క్వారీల క్రసర్ల యజమానులు ఆ రోడ్డు దుస్థితిని గాని గిరిజనుల పడుతున్న ఆవేదనపై గాని పట్టించు కున్న దాఖలాలు ఉండవు.అలాగని అధికారులకు కూడా పట్టదనే చెప్పవచ్చు.విజయనగరం,అనకాపల్లి జిల్లాల సరిహద్దులో ఉన్న వేపాడ మండలం జిల్లాకే చివరి మండలం మండలానికి చివరి గ్రామాలుగా ఈ గిరిజన గ్రామాలు నిలుస్తాయి. మారుమూల ప్రాంతం కావడంతో రవాణా శాఖ అధికారులు పర్యవేక్షణ లోపించడంతో రాతి క్వారీల క్రసర్ల నుండి రవాణా చేస్తున్న వాహనాలు యజమానులకు అడ్డు అదుపు లేకుండా పోతుంది.వాహనాల యజమానులు ఇష్టారాజ్యంగా వ్యవహరించిన వారిని అడిగే నాధుడే లేక భారీ వాహనాలతో అధిక బరువులతో తిరగడం వల్ల తారురోడ్డు వేసిన అనంత కాలంలోనే పూర్తిగా శిథిలమై మట్టిరోడ్డుగా మారిపోయింది.రోడ్డంతా రాళ్లు రప్పలతో తేలిపోయి నిలువెత్తు గోతులుగా మారడంతో గిరిజనులు రాకపోకలు సాగించేందుకు నిత్యం నరకం చూస్తున్నారు.కనీసం మరమ్మతులకు గురైన మేరకైనా తారు రోడ్డు వేయాలన్న తలంపు అధికారులకు కానీ పాలకులుకు గాని లేకపోవడం విచారకరం.కాగా వైసిపి అధికారంలో ఉన్నప్పుడు ఈ గిరిజన గ్రామాలకు ప్రధాన రహదారికి దిక్కు లేకపోగా ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరునెలలు గడుస్తున్నప్పటికీ ఈ రోడ్డు దుస్థితి పట్టించు కోకపోవడం, ఆయాగ్రామాల గిరిజనులు విమర్శలు గుప్పిస్తున్నారు.అలాగే ఈ రోడ్డు ఈ దుస్థితికి కారణమైన క్రసర్లు క్వారీల యజమానులపై చర్యలు తీసుకో వాలని గిరిజనులు కోరుతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ అధికా రులు స్పందించి వీలుపర్తి చినదుంగాడ రోడ్డులో అధిక బరువులతో రవాణా చేస్తున్న వాహనాలను నిలువరించాలని అలాగే పాలకులు పట్టించుకోని నూతన రోడ్డు నిర్మాణానికి సన్నాహాలు చేసి ఆదుకోవాలని గిరిజనులు కోరుతున్నారు.

క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్

విశాలాంధ్ర - రాజాం: రాజాం పట్టణ, పరిసరాల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక ఎమ్మెల్యే కోండ్రు మురళీ మోహన్ స్థానిక అర్సిఎం చర్చ్లో జరిగిన వేడుకల్లో పాల్గొన్నారు. చర్చ్లో జరిగిన ప్రార్థనలలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రేమ, దయ, క్షమా గుణాలు కలిగి ఉండాలనే ఏసుక్రీస్తు సందేశంను ప్రతీ ఒక్కరు అనుసరించాలన్నారు. అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పాస్టర్, స్థానికులు జరజాన నీలయ్య, జానకీరావు, అంపోలు శ్రీనివాసరావు, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకుంటాం: కోండ్రు



విశాలాంధ్ర-రాజాం : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు రాజాం మండలం ఓమ్మి గ్రామంలో తడిసి, దెబ్బతిన్న పెసర పంటను ఎమ్మెల్యే కోండ్రు మురళీ మోహన్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వర్షాలకు దెబ్బతిన్న పంట వర్షం. నివేదికలు వెంటనే సిద్ధం చేయాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. నివేదిక వచ్చిన తరువాత మంత్రి అచ్చెన్నాయుడు, సిఎం చంద్ర చంద్రబాబు నాయుడులతో మాట్లాడి, నష్టపోయిన రైతులను ఆదుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ వంగా వెంకటరావు, తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్ గురవాన నారాయణరావు, పొగిరి ఎంపిటిసి జగన్మోహన్రావు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు సడలించి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

వైసీపీ నాయకుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు

విశాలాంధ్ర-చీపురుపల్లి: వర్షాల కారణంగా తడిసి మొలకెత్తిన ధాన్యాన్ని నిబంధనలు సడలించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని విజయనగరం జిల్లా వైస్సార్ పార్టీ ప్రచారవిభాగం అధ్యక్షుడు (పబ్లిసిటీ వింగ్)వలిరెడ్డి శ్రీనివాసనాయుడు కోరారు. బుధవారం నాడు చీపురుపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తడిసి మొలకెత్తిన ధాన్యాన్ని నిబంధనలను సడలించి ప్రభుత్వం కొనుగోలు చేయాలిఅని డిమాండ్ చేశారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్ పంట రైతు చేతికి అంది నూర్పులు చేసి మిల్లులకు తరలిస్తున్న సమయంలో అల్ప పీడనాలతో అకాల వర్షాలు రైతుల పాలిటశాపంగా మారాయని వలిరెడ్డి శ్రీనివాసనాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. విజయనగరం జిల్లా లో తడిసి మొలకెత్తిన ఓవులతో ఉన్న పంటను పక్వానికి వచ్చిన వరిచేలను కోయక తప్పని పరిస్థితి అదే సందర్భంలో గత పదిరోజులుగా కురుస్తున్నవర్షాలకు తప్పని పరిస్థితుల్లో రైతు యొక్క పంట వర్షాలకు ఓవుతో మరియు కుప్పలు వేసిన చేలలో నుండి కూడా తడిసిన ధాన్యం మొలక రావడం జరుగుతుందిఅన్నారు. ఈ పరిస్థితుల్లో అక్కడక్కడ ధాన్యం రంగు మారిన పరిస్థితులు కూడా ఏర్పడుతున్నాయి అన్నారు. ప్రకృతి వైపరీత్యం వల్ల జరిగిన పంట నష్టంగా గుర్తించి, ధాన్యం సేకరణ నిబంధనలలో మినహాయింపు ఇచ్చి ధాన్యం సేకరణ చేసి నష్టం జరిగిన ప్రతి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ఇప్పటికే ఎకరాకు 20 వేల రూపాయలకు పైగా పెట్టుబడి పెట్టగా పంట తడిసి మొలక రావడంతో అపార నష్టం జరిగే అవకాశాలు ఉన్నాయి అన్నారు. వరి రైతుల సమస్యలను ప్రభుత్వం పరిగణలోకి తీసుకొని రైతు ధాన్యాన్ని కొను గోలుచేసి రైతునాదు కోవాల్సిందిగా కోరారు, కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు ఎన్నికల్లో ఇచ్చిన హామీ రైతు పెట్టుబడి సాయం సవత్సరానికి ఇరవై వెలరూపాయలు (20000)సూపర్ సిక్స్ హామీ తక్షణమే అమలు పరచాలని కోరారు. రైతులకు అవసరమైన యూరియా కోసం చాలా డిమాండ్ ఉంది అని రైతులకు సరిపడిన యూరియా అందించిన పరిస్థితి ఈ ప్రభుత్వం లో లేదు అని వలిరెడ్డి శ్రీనివాసనాయుడు అన్నారు, రైతులు పడుతున్న ఇబ్బందులు మంత్రులు కానీ ఎమ్మెల్యే లు కానీ పట్టించు కున్న పాపాన పోలేదు అని తక్షణమే ప్రభుత్వం స్పందించి రైతులు పడుతున్న ఇబ్బందులు గుర్తించి వారిని ఆదుకోవాలని డిమాండ్ చేసారు.

ఘనంగా వాజ్‌పేయి జయంతి

విశాలాంధ్ర-గజపతినగరం: గజపతినగరంలో బీజేపీ మండల అధ్యక్షులు ఆరిశెట్టి ఏడుకొండలు స్వగృహం లో మాజీ ప్రధాని అటల్ బీహార్ వాజ్పేయి శతాబ్ది జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు ఆయన చేసిన సేవలను అణువణువునా దేశభక్తిని కొనియాడారు. కార్యక్రమంలో బిజెపి పార్టీ నాయకులు ఈశ్వరరావు తవిటి నాయుడు పైడపు నాయుడు సాంబ భాస్కరరావు మహిళా మోర్చా రాజేశ్వరి తౌడు తదితరులు పాల్గొన్నారు.

రాజాంలో ఘనంగా వాజ్ పేయ్ జయంతి వేడుకలు

విశాలాంధ్ర-రాజాం: స్థానిక మానవత సంస్థ ఆధ్వర్యంలో దివంగత మాజీ ప్రధాని ఎబి వాజ్ పేయ్ శతజయంతి వేడుకలు బుధవారం మనంగా జరిగాయి. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. దేశంలో రహదారుల విస్తరణ కార్యక్రమాన్ని నిర్వహించి, దేశాభివృద్ధికి దిక్సూచిగా నిలిచారన్నారు. కార్యక్రమంలో సంస్థ చైర్మన్ కొత్త సాయి ప్రశాంత్ కుమార్, ప్రతినిధులు మక్క అప్పలనాయుడు బి.వి. అచ్యుతకుమార్, పెంకి గౌరీశ్వరరావు, మిత్తిరెడ్డి మధుసూధనరావు, ఆర్ఎజె నాయుడు, పెంకి చైతన్యకుమార్, లంక శ్రీహరినాయుడు, ఆర్నివల్లి వెంకటనాయుడు తదితరులు పాల్గొన్నారు.

శాంతి ప్రదాత ఏసు జయంతి వేడుకలు

పాస్టర్ రెవరెండ్ జాన్ విక్టర్

విశాలాంధ్ర-బొబ్బిలి: సర్వమానవాళి పాపవిమోచనకై, శాంతి స్థాపనకు భువి మీద ఉద్భవించిన శాంతి ప్రదాత యేసుక్రీస్తు అని సైంట్ ఆండ్రూస్ లుదరన్ చర్చ్ పాస్టర్ రెవరెండ్ పి జాన్ విక్టర్ అన్నారు. బుధవారం మహారాణి పేటలో గల లుదరన్ చర్చ్ లో చర్చ్ డెలిగట్ జె సి రాజు ఆధ్వర్యంలో క్రీస్తు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ జాన్ విక్టర్ మాట్లాడుతూ ప్రేమ, కరుణ, ద్వారాశత్రువు మనసు ను కూడా జయించవచ్చని తన జీవితం ద్వారానిరూపించి ప్రపంచానికి భోదించినమహిమోన్నతాడు క్రీస్తు ప్రభువని అన్నారు. క్రీస్తు చూపిన ప్రేమ, క్షమాపణ మార్గంలో నడుస్తుశాటిమనిషినివప్రేమిస్తూ మేలుచేయటమే మన కర్తవ్య మని అన్నారు. చర్చ్ డెలిగేట్ జె సి రాజు మాట్లాడుతూ ప్రేమ, దయ,కరుణ,సహనం త్యాగం, క్షమాగుణం అలవాటు చేసుకొని మానవ జీవితాన్ని శాంతి మాయం చేసుకోవాలని కోరారు. అనంతరం క్రిస్మస్ కేక్ ను కట్ చేసి హాజరైన క్రైస్తవ క్రైస్తవేతరులకు దీవెనలు అందిస్తూ సర్వమానవాళి దుష్టత్వానికి దూరంగా ఉంటూ క్రీస్తు దీవెనలు పొందుకుంటు సుఖ శాంతులతో ఉండాలని ప్రార్ధించారు. హాజరైన వారందరకు బహుమతులను పంపిణీ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలను డెలిగేట్ జె సి రాజు తెలియ జేశారు. కార్యక్రమంలో చర్చ్ ప్రతినిధులు పి వి ఏ మెర్సీ బాయ్, డేవిడ్ జె విక్టర్, పెంకి రాజు, రమణ మాస్టర్. శేఖర్ లు మరియు రోటరీ అధ్యక్షులు సింద్రీ శ్రీనివాసన్, ప్రెసిడెంట్ ఎలెక్ట్ శ్రీ హరి , చంద్ర కిషోర్, రామ కృష్ణ, కృష్ణ మోహన్, జోసెఫ్, రఫి బొబ్బిలి మల్టీ టాలెంటెడ్ గ్రూప్ ప్రతినిధులు కరుణ కుమార్, చిన్ని కృష్ణ క్రైస్త వ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

వేపాడలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

విశాలాంధ్ర-వేపాడ: మండల కేంద్రమైన వేపాడ ఆర్.సీ.ఎం చర్చ్ ఫాదర్ బి.బాలరాజు ఆధ్వర్యంలోక్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా చర్చ్ ను అలంకారప్రాయంగా తయారు చేసి ఏసుప్రభువు మేరీ మాత ఒడిలో ఉన్న బాల యేసు విగ్రహం పురిపాకలో ఉండే విధంగా తయారు చేయడంతో అందరినీ ఆకర్షించాయి.అలాగే చర్చి ఫాదర్ బి.బాలరాజు మాట్లాడుతూ ప్రభు ఏసు బోధనలు నేటి సమాజానికి ఎంతగానో ఉపయోగకరమన్నారు.ప్రతి మతము మంచిని చేయు మంచిని పంచు అనేటువంటి నానుడుతో ముడిపడి ఉన్నాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు పెద్దలు దేవతల రూపంలో క్రిస్మస్ తాత రూపంలో వస్త్రధారణ పలువురిని ఆకర్షించింది.ఈ కార్యక్రమంలో పలువురు క్రిస్టియన్ మతస్తులు ఏసుప్రభు భక్తులు పాల్గొన్నారు.

గజపతినగరంలో క్రిస్మస్ వేడుకలు

విశాలాంధ్ర- గజపతి నగరం: మండలంలోని తుమ్మికాపల్లి గ్రామంలో చర్చిలో క్రిస్టమస్ వేడుకలు పాస్టర్ బెజ్జుపల్లి రామనారాయణం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ప్రజలు ప్రార్ధనలు చేసి కేక్ కట్ చేసి ఒకరు ఒకరు అభినందించారు కొన్నారు.

పంటలకు బీమా చేయించుకోవాలి

వ్యసాయాధికారి హరికృష్ణ

విశాలాంధ్ర-భోగాపురం: రైతులు పంట బీమా పరిహారం పొందా లంటే ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకం ద్వారా పంటలకు బీమా చెల్లించాలని వ్యవసాయ శాఖ ఏవో హరికృష్ణ స్పష్టం చేశారు. ప్రకృతి విపత్తులు, అకాల వర్షాలు, వర్షాభావ పరిస్థితుల్లో వంట నష్టపోయినప్పుడు పరిహారం అందుకోవాలంటే పంటలు భీమా ప్రీమియం రైతులు చెల్లించాల్సి ఉంటుందని ఆయన అన్నారు. ప్రస్తుత రబీ సీజన్లో మామిడి,మొక్క జొన్న,మినుములు, పెసలు పంటలకు ప్రధాన మంత్రి ఫసల్ బీమా పథకం ద్వారా బీమా చేసుకోవచ్చని అయన తెలిపారు. ప్రతికూల వాతావరణ పరిస్థితులు వల్ల పంటల బీమా చేయించుకోవడం మేలని తెలిపారు. ప్రస్తుతం మామిడి,మొక్క జొన్న,మినుములు, పెసలు పంటలు వేసిన రైతులు వ్యవసాయ శాఖ కార్యాలయానికి వస్తే వారికీ పంట వేసినట్టు షోయింగ్ సర్టిఫికెట్ ఇస్తామని అన్నారు. దీనితో పాటు వారియొక్క 1బి, ఆధార్ కార్డు,తీసుకువెళ్లి బీమా చేయించుకోవాలని కోరారు. నెల 31 లోగా పంటల భీమా చేయించుకోవాలని సూచించారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా అన్ని సిఎస్సి కేంద్రాల్లో అతి తక్కువ ప్రీమియం చెల్లించి పంటలు బీమా చేసుకోవచ్చన్నారు.ఈ అవకాశాన్ని రైతులందరూ వినియోగించుకోవాలని కోరారు.

వైయస్సార్సీపి నాయకుడు

ఇప్పిలి అనంతం నకు పితృవియోగం

విశాలాంధ్ర-చీపురుపల్లి: చీపురుపల్లి మండల వైఎస్సార్సీపీ నాయకుడు, మండల వైఎస్ఆర్సిపి మాజీ అధ్యక్షుడు ఇప్పిలి అనంతం తండ్రి తుది శ్వాస విడిచారు. అనంతం తండ్రి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. అనంతం తండ్రి విజయనగరం మెడికవర్ హాస్పిటల్ నందు చికిత్సపొందుతూ బుధవారం ఉదయం తుది శ్వాస విడిచారు. ఇప్పిలి అనంతం స్వగ్రామైన రామలింగాపురం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహిం చారు. అనంతం తండ్రి భౌతిక గాయాన్ని విజయనగరం జిల్లా మాజీ పార్లమెంట్ సభ్యులు బెల్లం చంద్రశేఖర్, విజయనగరం జడ్పీ చైర్ పర్సన్ మజ్జి శ్రీనివాసరావు చీపురుపల్లి మాజీ జెడ్పిటిసి మీసాల వరహాల నాయుడు చీపురుపల్లి నియోజకవర్గంలో గల పలువురు రాజకీయ నాయకులు అధికారులు కార్యకర్తలు సందర్శించి నివాళులర్పించారు.

తుఫాను ప్రభావానికి తడిసి ముద్దవుతున్న పల్లెలు

విశాలాంధ్ర-తెర్లాం: తెర్లాం మండలంలో గత అర్ధరాత్రి నుంచి తరచుగా కురుస్తున్న చిరుజల్లులకు తడిసి ముద్దవుతున్న పల్లెలు,అలాగే పసువులు, మేకలు బయటకు వెళ్లే పరిస్థితి లేక మూగ జీవులు పశువుల శాలకే పరిమితమవుతున్నాయి అని పశువుల కాపారులు, గొర్రెల కాపారులు ఆవేదన చెందుతున్నారు.

ఆనంద గజపతి ఆడిటోరియం

కొన్ని సంస్థలకు రాయితీలు

విశాలాంధ్ర-విజయనగరం అర్బన్ : నగరంలోని ప్రతిష్టాత్మకమైన ఆనంద గజపతి ఆడిటోరియంలో పలు కార్యక్రమాలు నిర్వహించుకునే నిమిత్తం కొన్ని సంస్థలకు రాయితీ ద్వారా అందించనున్నట్లు విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఓ ప్రకటనలో తెలిపారు. ఆనంద గజపతి ఆడిటోరియం ప్రస్తుతం నగరపాలక సంస్థ అదీనంలోకి వచ్చిన విషయం ప్రజలకు విధితమేనని అన్నారు. అయితే క్రీడా, సంగీత, సాహిత్య, సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాలను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో ఆనంద గజపతి ఆడిటోరియంను వినియోగించుకునే నిమిత్తం రాయితీ ద్వారా అందించాలన్న విషయమై కౌన్సిల్ దృష్టికి తేగా, ఇత్యాది సంస్థలకు 50 శాతం రాయితీ ద్వారా ఇప్పించాలని కౌన్సిల్ తీర్మానించిందని తెలిపారు. దీంతో ప్రస్తుతం ఆనంద గజపతి ఆడిటోరియాన్ని ప్రైవేటు కార్యక్రమాల నిమిత్తం వినియోగించుకునే పరిస్థితుల్లో రోజుకి 30 వేల రూపాయలు చొప్పున వసూలు చేయడం జరుగుతుందన్నారు. అయితే క్రీడ,సంగీత, సాహిత్య, సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాలు కోసం వినియోగించుకునే నిమిత్తం ఆనంద గజపతి ఆడిటోరియం నకు రోజు ఒక్కంటికి 15 వేల రూపాయలు అంటే సగం ధరకే రాయితీగా ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ విషయమై ప్రజలు, వివిధ సంస్థలు గమనించి ఆనందగజపతి ఆడిటోరియాన్ని వినియోగించుకోవచ్చని తెలిపారు. ప్రజా శ్రేయస్సుకై వివిధ సంస్థల ప్రోత్సాహానికి కౌన్సిల్ తీర్మానించిన అవకాశానికి తాము అభినందనలు తెలియజేస్తున్నామన్నారు. అలాగే సంస్థలు కూడా ఈ విషయాన్ని గమనించి ఆనంద గజపతి ఆడిటోరియాన్ని సగం ధరకే వినియోగించుకోవచ్చని తెలిపారు.

ఘనంగా వాజ్‌పేయ్ శతజయంతి వేడుకలు

విశాలాంధ్ర-జామి: మాజీ ప్రధానమంత్రి, భారతరత్న అటల్‌బిహారీ వాజ్‌పేయ్ శతజయంతి వేడుకలను జామి మండల బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా వాజ్‌పేయ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈకార్యక్రమానికి జిల్లా ఉపాధ్యక్షులు బూర్లె శ్రీధర్, దుద్దు సాంబమూర్తి, మండల పార్టీ అధ్యక్షురాలు రాయవరపు ఆదిలక్ష్మిలు హాజరై వాజ్‌పేయ్ దేశానికి సేవలను వివరించారు. జీవితాంతం దేశం కోసం ఆయన పనిచే సారని, నమ్మిన సిద్ధాంతంను వదిలిపెట్టలేదని, రాజనీతిజ్ఞుని గా, అనమాన దేశభక్తునిగా ఖ్యాతిని ఆర్జించారన్నారు. ఈకార్యక్రమంలో కాపుగంటి వెంకటేష్, ఉప్పల రమణితోపాటు పలువురు పాల్గొన్నారు.

బిజెపి ఆధ్వర్యంలో అటల్ బీహార్ వాజ్ పేయి 100వ జయంతి వేడుకలు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: భారతజాతి గర్వించ దగ్గ నేత వాజ్ పేయి అని భారతీయ జనతా పార్టీ జిల్లా మాజీ అధ్యక్షులు, జాతీయ కౌన్సిల్ సభ్యులు బవిరెడ్డి శివప్రసాద్ రెడ్డి అన్నారు బుధవారం వాజ్ పేయి 100 జయంతి సందర్భంగా సౌత్ మండలం లైన్స్ క్లబ్ వద్ద మండల అధ్యక్షులు ఇప్పిలి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముందుగా వాజ్ పేయి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారత జాతికి శాంతిమంత్రం జపించడమే కాదు, యుద్ధతంత్రం కూడా తెలుసునని నిరూపించిన నాయకుడని తన రాజకీయ చతురతతో దేశ గతినే మార్చిన మహానేత అన్నారు సుపరిపాలనను పరిచయం చేసిన పరిపాలనాధ్యక్షుడు వాజ్ పేయి అని కొనియాడారు. తన జీవితాన్ని భారతమాత సేవకై అంకితమిచ్చిన దేశభక్తుడని, శత్రువుల చేత కూడా శహభాష్ అనిపించుకున్న అజాత శత్రువు అని అఖండ భారతం కోసం కలలు కన్న దార్శనికుడని భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు వారిని ఆదర్శంగా తీసుకొని పనిచేయాలని అన్నారు. కార్యక్రమంలో రూరల్ మండల అధ్యక్షులు, జొన్న వలస నీటి సంఘం ఉపాధ్యక్షులు కంది సీతారాం, జిల్లా ఉపాధ్యక్షులు బూర జగ్గారావు యాదవ్, తదితరులు పాల్గొన్నారు. ..

గుంతలమయంగా...బాగింపేట రోడ్డు

విశాలాంధ్ర-వంగర : మండలంలోబాగింపేట రోడ్డు పది గ్రామాల ప్రజలకు నరకాన్ని తలపిస్తుంది .తలపిస్తుంది. రాజాం నుంచి వంగర రోడ్డులో అరసాడ గ్రామం వద్ద నుండి బాగింపేట వరకూ ఉన్న రోడ్డుకు గత కొన్నేళ్లుగా రోడ్డునుంపట్టించుకోక పోవటం వల్ల రోడ్డు పూర్తిగా గోతులు మయంగా తయారైంది. అరసాడ నుంచి బాగింపేటకు సుమారుగా 10 కిలోమీటర్లదూరంలో గల ఈ రోడ్డులో అడుగుకొక గొయ్యిలతో తయారైంది.ఈ విధంగా ఈ రోడ్డు గతకొన్నేళ్లుగా గోతులతో ప్రజలకు నిత్యం నరకాన్ని తలపిస్తుంది.నాలుగు చక్రాలు వాహనాలు, టూ వీలర్ లు, సైకిల్ తదితర వాహనాలు తరగటానికి కూడా నరకాన్ని చిపిస్తున్నాపట్టించుకోవటం లేదని పలు గ్రామాలు ప్రజలు మండి పడుతున్నారు.ఈ రోడ్డు వంగర మండలంనకు సంబంధించి నీలయ్యవలన, బాగింపేట, పాటువర్ధనం, శ్రీహరిపురం, శ్రీహరిపురం ఆర్ అండ్ ఆర్ కాలనీ, కింజంగి ఆర్ అండ్ ఆర్ కాలనీ గ్రామాలకు,రేగిడి మండలంలో కొండవలస,మన్యం జిల్లా బలిజిపేట మండలానికి చెందిన గేదెలపేట, కు ఇదే రహదారి.ఈ రోడ్డు మీదుగా నే గత పదేళ్ళగా రాజాం నుండిబాగింపేట వరకూ ఆర్టీసీ బస్సులు తిరుగుతుండేవి. కానీ గత రెండేళ్లుగా రోడ్డు పూర్తిగా గోతులుతో పూర్తిగా నిండి పోవటంతో గత రెండేళ్లుగా బస్సులు తిప్పటం నిలిపివేశారు. దీంతో ఈ పది గ్రామాల ప్రజలు బయట కు వెళ్లాలంటే ప్రజలు ఈ 10కిలోమీటర్ల దూరం కొన్ని గ్రామాలు,మరికొన్ని గ్రామాలు వారు 15 కిలోమీటర్ల దూరం నడిచి టూ వీలర్ల తో వెళ్లి రాజాం,తదితర పట్టణ ప్రాంతాలకు వెళ్ళటం ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారు.

ఇలాంటి రోడ్డు ఈ విధంగా తయారై ప్రజలు నరకాన్ని చూస్తున్న ప్రజా ప్రతినిదులు ఎవ్వరూ పట్టించుకోవటం లేదని ఆయాగ్రామాల ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఈ రోడ్డు కు నిధులు సమకూర్చిన ట్లు చూసి సమకూర్చిన ట్లు చూసి కొత్తగా రోడ్డు ను నిర్మించటానికి చర్యలు తీసుకొని ఈ పది గ్రామాల ప్రజలకు రహదారి సౌకర్యం చూపించి బస్సులు నడిచేటట్లు చర్యలు తీసుకోవాలనిఆయా గ్రామాల ప్రజలు ప్రజా ప్రతినిధులను కోరుతున్నారు.'

మండలంలో ఘనంగా క్రిస్మస్



విశాలాంధ్ర-మెంటాడ: క్రీస్తు పుట్టిన శుభ సందర్భంగా మండలంలో ని వివిధ గ్రామాలలో గల చర్చిలలో క్రిస్మస్ ఆరాధనలు ఘనంగా నిర్వహించారు. గజపతినగరం పెంతుకోస్తు ఆలయంలో దాని అనుబంధ మెంటాడ, లక్ష్మీపురం, వాణిజ, కొనిస తదితర ఆలయాలలో క్రిస్మస్ ఆరాధనలు ఘనంగా నిర్వహించినట్లు పాస్టర్ బి.నతానియేల్ రాజు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వ మానవ పాపాల పరిహారార్థమై ఏసుప్రభు ఈ లోకానికి మానవ అవతారిగా పరిశుద్ధాత్మ ద్వారా కన్య మరియ గర్భమున జన్మించి 33 1/2 సంవత్సరాలు ఈ లోకంలో జీవించి దేవుని గూర్చిన సువార్తను ప్రకటిస్తూ అనేక అద్భుత కార్యాలు అనేక ఆశ్చర్యకరమైన సూచక క్రియలు జరిగించి ప్రజలలో ప్రభువైన యెహోవాయందు విశ్వాసముంచువారిగా గొప్ప చైతన్యం ప్రజలలో తీసుకొచ్చారనీ అనంతరం మానవాళి పాప పరిహార్ధ బలిగా ఆయన సిలువమానుపై తన ప్రాణాలను త్యాగం చేసినట్లు తెలిపారు. తద్వారా మానవాళి అందరికీ మోక్షం లభించినట్లు బైబిల్ గ్రంథం తెలియజేస్తున్నట్లు తెలిపారు. తాను భూమిపై జీవించినంత కాలం రానున్న తరానికి మాదిరి కరంగా జీవించారని పాపమంటని పరిశుద్ధునిగా ఆయన జీవిత ప్రయాణం కొనసాగిందని అన్నారు. ఆయనను వెంబడించు వారు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఇతరులపై ప్రేమ కనికరము జాలి దయ చూపించి దేవుని ప్రేమను పొందే వారిగా జీవించాలని కోరారు. క్రీస్తు పుట్టిన సందర్భంగా క్రిస్మస్ ఆరాధనగా కేవలం భారతదేశం మాత్రమే కాకుండా ప్రపంచ దేశాలు క్రిస్మస్ పండగను ఆచరిస్తాయని తెలిపారు. నిన్ను వలే నీ పొరుగు వారిని ప్రేమించు అనే వాక్యాన్ని ఈ సందర్భంగా జ్ఞాపకం చేశారు. కార్యక్రమంలో సీనియర్ పాస్టర్ బండి సాల్మన్ రాజు, వి దేవానందం, పాస్టర్ శ్రీను, బి హేబెల్ సంఘ పెద్దలు విశ్వాసులు సండే స్కూల్ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

భక్తులను విశేషంగా ఆకట్టుకున్న ప్రవచనాలు

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్: పట్టణంలోని రింగ్ రోడ్ శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం లో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా పదవరోజు రంగనాథమండపం వేదికపై సాయంత్రం శ్రీమాన్ ఎస్ పి రాధాకృష్ణమాచార్య చే జరిగిన ఆధ్యాత్మిక ప్రవచనాలు భక్తులను ఆకట్టుకున్నాయి.మోక్షముఅనగా ఇహలోకంలో నేను,నాదిఅనేభావం వదిలిపెట్టి భగవానుని కీర్తించి ఆతని పాద స్పర్శ పొందడంఅని శరీరాన్ని విడిచి పెట్టడం కాదని తెలిపారు. ప్రణవ అధ్యాయం గురించి తెలిపారు. మూడువేదములలోని మంత్రాక్షరములలో సారమే ప్రణవం గా అమ్మ మనకు అందించిందని తెలిపారు. అష్టాక్షరీ మంత్రము, భారత,రామాయణం లోని విశేషాలు తెలియజేసారు.